క్లుప్తంగా

మహిళా వర్సిటీ రిజిస్ట్రార్‌గా రజిని



తిరుచానూరు: పద్మావతి మహిళావర్సిటీ రిజిస్ట్రార్‌గా ఎస్.రజిని గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రిజిస్ట్రార్ డీఎం.మమత పదవీ కాలం ముగియడంతో వర్సిటీలో హోం సైన్స్ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఎస్.రజినిని రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ మేరకు ఆమె గురువారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం వైకుంఠ ద్వార దర్శనం ద్వారా బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసులు, శ్రీదేవి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

వసతి గృహ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ రవి డిమాండ్ చేశారు. వారు గురువారం ఆ సంఘం కార్యకర్తలతో కలిసి బాలాజీ కాలనీ సర్కిల్‌లో భిక్షాటన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వసతి గృహాల్లోనున్న విద్యార్థులకు ఇస్తున్న మెస్ చార్జీలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలన్నారు.

ఘనంగా పరిణయ సిల్క్స్ వార్షికోత్సవం



సంబరాలు జరుపుకుంటున్న షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పరిణయ సిల్క్స్ షోరూంలో గురువారం మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చిల్లీస్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత అంజి, వైఎస్సార్ సీపీ నేత ఉదయగిరి రమేష్ పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. షోరూం అధినేత గద్దెల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కంచి పట్టు, బెనారస్ చీరలు, ఎక్స్‌క్లూజివ్ డిజైనర్ శారీస్, బ్రైడల్ లేహంగాస్ సరికొత్త కలెక్షన్స్‌పై ప్రత్యేకంగా 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు తెలిపారు. ముందెన్నడూ లేని విధంగా తక్కువ ధరలతో వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మురళి, ఢిల్లీ, నవతా రమేష్, సతీష్, మునిబాబు, రాజా పాల్గొన్నారు.

నయనానందకరం.. నటరాజస్వామి అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి 7 గంటలకు శ్రీనటరాజస్వామి, శివగామి అమ్మవార్ల అభిషేక దర్శనం నయనానందకరంగా జరిగింది. పురోహితులు చిట్టమూరు రమేష్ బాబు, ధనలక్ష్మి దంపతులు ఏటా ధనుర్మాస పౌర్ణమి రోజున ఆరుద్ర ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పౌర్ణమి ముందు రోజు చతుర్దశిని పురస్కరించుకుని నటరాజస్వామి, శివగామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పంచామృతం, చందనం, విబూది, కలశ జలాలతో అభిషేకాలు చేశారు.

నేడు ఆరుద్ర ఉత్సవం

శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, సూర్యోదయంతో ఆరుద్ర దర్శన భాగ్యం కల్పించనున్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.

ప్రతి గడపలోనూ సంక్షేమం

- జగనన్న పాలనపై ప్రజలు సంతృప్తి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: ఏ గడపకు వెళ్లినా జగనన్న సంక్షేమమే కనిపిస్తోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మేయర్ శిరీష, వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్ బసవ గీత, డివిజన్ అధ్యక్షుడు కట్టా గోపీయాదవ్‌తో కలిసి 37వ డివిజన్‌లోని పరసాల వీధి, గాజువీధి ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. వారికి స్థానికులు హారతులతో ఘన స్వాగతం పలికారు. పథకాలు తమ జీవితాల్లో వెలుగులు నింపాయని, ఇన్ని చేసిన జగనన్నకు ఓటుతో రుణం తీర్చుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను జగనన్న అందజేస్తున్నారని తెలిపారు. తాము ఏ గడపకు వెళ్లినా ప్రజలు హారతులతో సాదరంగా స్వాగతం పలకడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం, ఇమ్రాన్, బాలాజీ, బొమ్మగుంట రవి, కోదండ, కట్టా మోహన్, జయలక్ష్మి, మునిరాజ, ఎస్సీ కుమార్, భూపతి, బచ్చు పెరుమాల్, కంకనాల రమేష్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీలు



పాలిహౌస్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు రాయితీలు ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం చంద్రగిరికి చెందిన శ్రీనివాసులురెడ్డి పాలిహౌస్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన పాలిహౌస్ నిర్మాణానికి సుమారు రూ.8.74 లక్షలు అయ్యిందని తెలిపారు. అందులో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4.37 లక్షలు ఇచ్చిందన్నారు. అందులో సాగు చేసే కూరగాయల పెంపకానికి చదరపు మీటరుకు రూ.70లు, పూల పెంపకానికి రూ.213లు రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శాశ్వత పందిరిపై తీగజాతి కూరగాయల పెంపకం కోసం ఎకరాకు రూ.2.11 లక్షలు అవుతుందని, అందులో రూ.లక్ష రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల కోసం మండల ఉద్యాన అధికారిణి లేదా ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు. మండల ఉద్యాన అధికారిణి శైలజ, ఇంజినీర్ చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



నీమాస్త్రం తయారీపై రైతులు, మహిళలకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

చంద్రగిరి: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎస్ఎఫ్ఎంటీ శ్రీదేవి తెలిపారు. కొండ్రెడ్డికండ్రిగ, శేషాపురం గ్రామాల్లో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రసాయనాలు వినియోగించకుండా సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అనంతరం నీమాస్త్రం, పంచగవ్య, ఘన జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆర్‌బీకే సిబ్బంది సుహాసిని, శంకర్, వేదవతి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయండి



ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఎస్టీయూ నాయకులు



ఆపస్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఆపస్ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బోధన చేస్తూ విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని డీఈవో వి.శేఖర్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రూపొందించిన 2023 డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయికి తగ్గట్టుగా మన విద్యార్థులను తీర్చిదిద్దాలన్నదే సీఎం ఆశయమని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమను తాము మెరుగుపరుచుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి జిల్లా మెరుగైన స్థానం సాధించేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు టి.ధనుంజయనాయుడు, బి.మునికృష్ణ నాయుడు, టి.శ్రీనివాసులు, చెంచురత్నం, పి.మురళీకృష్ణ, వేణుగోపాల్, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎడ్యుకేషన్: ఆపస్ రూపొందించిన 2023 డైరీ, క్యాలెండర్లను గురువారం డీఈఓ వి.శేఖర్ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని తెలిపారు. జాతీయ భావజాలంతో, దేశభక్తితో, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఆపస్ కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం 16న కనుమ పండుగ నేపథ్యంలో సంక్రాంతి సెలవులను 18వ తేదీ వరకు పొడిగించాలని కోరుతూ డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగరాజు, జి.సాంబిరెడ్డి, సహాధ్యక్షులు టి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కందారపు మురళి



తిరుపతి కల్చరల్: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కందారపు మురళి నియమితులయ్యారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు భీమవరంలో నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఎంపిక చేశారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తిరుపతి జిల్లాకు చెందిన ఎ.పుల్లయ్య, జి.వెంకటేశం, ఆర్.లక్ష్మి, ఎస్.వాణిశ్రీ, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కె.వేణుగోపాల్‌ను ఎంపిక చేసినట్టు సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం తెలిపారు.

పార్టీలకతీతంగా పింఛన్ల మంజూరు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి

రామచంద్రాపురం: పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత జగనన్నకే దక్కిందని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 195 కొత్త పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటికే ఇస్తున్న పింఛన్లు కలుపుకుని 5,680 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. వీరికి నెలకు రూ.1,53,51,750లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరుపతిలో టేప్ ఎగ్జిబిషన్



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న టేప్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో శని, ఆదివారాల్లో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ మ్యానుఫ్యాక్చర్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు ద అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్ (టేప్) చైర్మన్ వెంకటేష్‌బాబు, అధ్యక్షుడు ఎం.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో టేప్ ఎగ్జిబిషన్ బ్రోచర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గృహ నిర్మాణదారులకు నాణ్యమైన అన్ని రకాల మెటీరియల్, టెక్నాలజీస్, పరికరాలతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌కు హాజరైన వారికి కూపన్లు అందజేస్తామని, గంట గంటకు లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. టేప్ ప్రధాన కార్యదర్శి బి.షణ్ముగం, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.శివప్రసాద్, కోశాధికారి నరేష్, సభ్యులు బి.సురేష్, సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు, శివశంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

త్యాగరాజ ట్రస్ట్ నూతన కమిటీ ఎంపిక



త్యాగరాజ ట్రస్ట్ సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ ట్రస్ట్ నూతన కమిటీని ఎంపిక చేసినట్టు రిటైర్డ్ చీఫ్ కమిషనర్ పీఎస్.కృష్ణమూర్తి తెలిపారు. త్యాగరాజ కళాక్షేత్రంలో గురువారం ట్రస్ట్ సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతిచెందిన భీమాస్ రఘు, డాక్టర్ విద్యాసాగర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీమాస్ అశోక్, డాక్టర్ రవి సాగర్‌ను బోర్డు ట్రస్టీలుగా ఎన్నుకున్నారు. అలాగే చెన్నైకి చెందిన మురళీధర్ ట్రస్ట్ సభ్యుడిగా ఎంపిక చేశారు. ప్రధాన సూత్రధారి భీమాస్ రఘు స్థానంలో మోహన సుందరానికి బాధ్యతలు అప్పగించారు. సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో కంచి రఘురామ్, ట్రస్ట్ ప్రతినిధులు వేణుగోపాల్, బాలసుబ్రమణ్యం, పప్పు వేణుగోపాల్, ఎస్.ప్రభాకర్, శ్రీనివాసులు, భానుమూర్తి, సుబ్రమణ్యం రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాది మృతి



ప్రియాంక (ఫైల్)

తిరుపతి లీగల్: తిరుపతికి చెందిన మహిళా న్యాయవాది కె.ప్రియాంక గురువారం చెన్నైలోని ఒక ఆస్పత్రిలో మృతిచెందారని తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్ తెలిపారు. ఆమె గుండె సంబంధిత ఆపరేషన్ చేసుకున్నారని, పరిస్థితి విషమించి మృతిచెందినట్టు పేర్కొన్నారు. ఆమె 2016 నుంచి తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం తిరుపతిలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే కోర్టు ఆవరణలో సంతాప సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

29, 30, 31 తేదీల్లో హమాలీల మహాసభలు

తిరుపతి కల్చరల్: ఈ నెల 29, 30, 31వ తేదీల్లో తిరుపతి వేదికగా హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలు నిర్వహించనున్నట్టు మహాసభల ఆహ్వాన సంఘం కన్వీనర్ పి.మురళి, హమాలీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాకృష్ణ, ఎన్‌డీ.రవి తెలిపారు. గంధమనేని శివయ్య భవన్‌లో గురువారం రాష్ట్ర మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వండి



మాట్లాడుతున్న కె.రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ కోరారు. గంధమనేని శివయ్య భవన్‌లో గురువారం తిరుపతి వాటర్ ప్లాంట్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ వాటర్ ప్లాంట్ల నిర్వహణ వ్యయం పెరుగుతోందన్నారు. విద్యుత్ చార్జీలు, డీజిల్ ధరలు, వాటర్ ఫిల్టర్ల ధరలు పెరుగుతున్నాయని తెలిపారు. వాటిని సరిచూసుకుంటూ ప్రజలకు మంచి నీరు ఇవ్వాలని సూచించారు. వాటర్ ప్లాంట్స్ ఓనర్స్ సమస్యలపై చర్చించుకునేందుకు ఈ నెల 22న సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీనికి కన్వీనర్‌గా బాలాజీ, కో కన్వీనర్‌గా ఎం.మోహన్‌బాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత సీహెచ్.శివకుమార్, అసోసియేషన నాయకులు చందు, రఘు, రామాంజనేయులు, రాయల్, కిషోర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలాంటి సమస్యలు ఉన్నా తెలపండి

పాకాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పథకాల పంపిణీలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని దామలచెరువు సెక్టార్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి తెలిపారు. మొగరాల, దామలచెరువు, రమణయ్యగారిపల్లి, వల్లివేడు, చంద్రగిరివారిపల్లి కేంద్రాల్లో గురువారం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తా ప్రతి నెలా లబ్ధిదారులకు బాలసంజీవిని, వైఎస్సార్ కిట్, పాలు, గుడ్లు అందజేస్తున్నట్టు తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు మిడ్డే మీల్స్ పెడుతున్నామని పేర్కొన్నారు.

అవ్వాతాతల మోములో సంతోషమే ధ్యేయం



అవ్వాతాతలకు పెన్షన్ కానుకను అందజేస్తున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తిరుపతి రూరల్‌లో 15,156 మందికి పెన్షన్
- కొత్తగా 573 మందికి మంజూరు
- ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుచానూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధికంగా రూ.2,750 పెన్షన్ కానుకను అందజేస్తూ చారిత్రాత్మక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తిరుచానూరు ప్రాథమికోన్నత పాఠశాల వద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలంలో 15,156 మందికి పింఛన్లు అందజేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా 573 మందికి పెన్షన్ మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అవ్వాతాతలకు వైఎస్ఆర్ పెన్షన్ కానుకను పెంచినట్టు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కష్టపడుతున్న జగనన్నను, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని కోరారు. తిరుచానూరు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ప్రజలకు సీఎం జగన్ రాసిన ఉత్తరాన్ని చదివి వినిపించారు. ప్రమాదంలో మృతిచెందిన జే.వల్లీ అనే మహిళ కుటుంబ సభ్యులకు బీమా పథకం కింద రూ.5 లక్షలు అందజేశారు. వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, యశోద, ఎంపీడీవో వెంకటనారాయణ, ఎంపీటీసీ నరేష్‌రెడ్డి, వార్డు సభ్యులు మునీంద్ర, కార్తీక్, మల్లి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రుయా అభివృద్ధికి కృషి చేయాలని వినతి



మంత్రిని కలిసిన బండ్ల చంద్రశేఖర్

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజనిని కోరారు. ఆయన గురువారం మంత్రికి వినతి పత్రం అందజేశారు. శాశ్వత సూపరింటెండెంట్ లేకపోవడంతో ఆస్పత్రి అభివృద్ధి కుంటుపడుతోందని, పనులు చేపట్టడం లేదన్నారు. న్యూరో సర్జరీ ప్రొఫెసర్ లేకపోవడంతో అత్యవసర వైద్యానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని వివరించారు. అలానే కార్డియాలజీ వైద్యులను నియమించాలని మంత్రికి విన్నవించారు. ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయన వివరించారు. కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న చిత్తూరు జిల్లాకు చెందిన మహిళకు మెరుగైన వైద్యం అందించాలని, కువైట్ లోని ఎంబసీ ఆఫ్ ఇండియా బండ్ల చంద్రశేఖర్‌కు ప్రత్యేకంగా లేఖ రాయడంపై ఆరా తీసిన మంత్రి ఆయనను అభినందించారు.